క్లుప్తంగా

నేడు మండల పరిషత్ చివరి సర్వసభ్య సమావేశం

కోదాడరూరల్ : కోదాడ మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ చివరి సర్వసభ్య సమావేశాన్ని బుధవారం ఎంపీపీ మల్లెల రాణి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాంచందర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలతో పాటు అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

చిలుకూరులో..

చిలుకూరు : మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య, ఎంపీడీఓ గిరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పద్మావతి హాజరవనున్నట్లు తెలిపారు. మండల స్థాయి అధికారులు తమ నివేదికలతో సకాలంలో హాజరు కావాలని కోరారు.

నేడు గ్రంథాలయ భవనం ప్రారంభోత్సవం

చిలుకూరు : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన చిలుకూరు బాపూజీ శాఖా గ్రంథాలయ భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే పద్మావతి ప్రారంభించనున్నారు. పాత గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రభుత్వ నిధులు, దాతల సహకారంతో నిర్మించిన ఈ భవనాన్ని అధికారికంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు.

నేడు పాల ఉత్పత్తిదారుల సంఘం సర్వసభ్య సమావేశం

చిలుకూరు : ఆనంద్ పాల ఉత్పత్తిదారుల సహాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశాన్ని బుధవారం మండల కేంద్రంలోని పాల కేంద్రం ఆవరణలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు నెల్లూరి నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పద్మావతి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి పాలవర్గ సభ్యులు, రైతులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

రైతులకు రాయితీపై విత్తనాలు అందించాలి

నడిగూడెం : ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులకు రాయితీపై విత్తనాలను మంజూరు చేయాలని రైతు సంఘం సీనియర్ నాయకుడు ఏనుగుల వీరాంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం నడిగూడెం మండలంలోని రామాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరి, పెసర, కంది, మినుము విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వం విత్తనాలు అందించకపోవడంతో రైతులు ప్రైవేటు షాపుల్లో నాసిరకమైన విత్తనాలను అధిక ధర పెట్టి కొనాల్సి వస్తుందని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి రైతులకు విత్తనాలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

చెన్నకేశవ పాల సొసైటీ చైర్మన్‌గా కనకయ్య


పిల్లుట్ల కనకయ్య

చిలుకూరు : పాత చిలుకూరు చెన్నకేశవ పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం నూతన చైర్మన్‌గా గ్రామానికి చెందిన పిల్లుట్ల కనకయ్య నియమితులయ్యారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. నూతన డైరెక్టర్లుగా సోమగాని వీరబాబు, బాడిసె సురేష్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి వీరారెడ్డి, మాజీ చైర్మన్లు కస్తూరి నర్సయ్య, కొండా లక్ష్మయ్య, ఆవుల శ్రీను, ఎన్నికల అధికారి కస్తూరి సైదులు, పాల సొసైటీ కార్యదర్శి బాడిసె గురవయ్య, పాలకవర్గ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి ఘనంగా ఆకుపూజ


ఆకుపూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో ఆంజనేయ స్వామికి మంగళవారం ఘనంగా ఆకుపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, ఆంజనేయస్వామికి పంచామృతాలు, 108 తమలపాకులతో అభిషేకం, ఆకుపూజ, గంధ సింధూరం, మన్యసూక్త పారాయణం, శ్రీరామ, ఆంజనేయ అష్టోత్తర శతనామావళి, అలంకరణ, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ముడుంబై మనోహరాచార్యులు, హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది యరగాని కిరణ్‌గౌడ్, గోవిందరెడ్డి, రమేష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

● దుర్వాసన బాబోయ్

కోదాడ : పట్టణంలోని నయానగర్ నడిబొడ్డున ఉన్న ఖాళీ స్థలం కుంటను తలపిస్తోంది. చిన్నపాటి వర్షం పడినా అక్కడ నీరు నిలుస్తోంది. మరోపక్క పరిసర ప్రాంత ప్రజలు, మున్సిపాలిటీ సిబ్బంది చెత్తను అక్కడే పడేస్తున్నారు. దీంతో దుర్గంధం వెదజల్లుతుండడంతో ప్రజలు, సమీప పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అంతే కాకుండా ఆ ఖాళీ స్థలం దోమలకు నిలయంగా మారి విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని ఆ ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ అధికారులు సదరు స్థల యజమానిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.



● మున్సిపాలిటీ స్థలం కబ్జా!

కోదాడ : మున్సిపాలిటీ కార్యాలయం తూర్పు ప్రహరీ గోడ పక్కన మున్సిపాలిటీకి చెందిన వాహనాలను నిలపడానికి రోడ్డు ఏర్పాటు చేశారు. కానీ ఈ రోడ్డు మీద రాత్రికి రాత్రే కొందరు డబ్బా కొట్లు ఏర్పాటు చేసుకున్నారు. అయితే మున్సిపాలిటీకి చెందిన కొందరు ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు వీరి నుంచి వేల రూపాయలు వసూలు చేస్తూ డబ్బా కొట్లను ఏర్పాటు చేయడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థలం ఆక్రమణతో ప్రస్తుతం మున్సిపాలిటీ వాహనాలను నిలపడానికి, వాహనాలు వెళ్లడానికి దారి లేని పరిస్థితి ఏర్పడింది. పురపాలక కార్యాలయ స్థలం ఆక్రమించినా అధికారులు పట్టించుకోకపోవడం గమనించదగ్గ విషయం.



వైభవంగా నారసింహుని నిత్యకల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని మంగళవారం అర్చకులు వేదమంత్రోచ్చారణలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రాతకాలార్చన, నిత్య హోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. విష్వక్సేనారాధన, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణ వేడుకను పూర్తిగావించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రవేశానంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా, క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్ అర్చకులు క్రిష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


స్వామివారి యాగశాల ప్రవేశం నిర్వహిస్తున్న ఆలయ పాలకవర్గ సభ్యులు, భక్తులు


పూజలు చేస్తున్న పూజారులు, పాలకవర్గ సభ్యులు, భక్తులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీగోదా పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఆలయంలో ఉదయం యాగశాలలో స్వామివారి ప్రవేశం, గరుడ హోమం, పూర్ణాహుతి, ధ్వజారోహణం, బలి ప్రసాదం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం సంతానార్థులకు గరుడ ప్రసాదం నివేదన, తీర్థప్రసాదాల గోష్టి, సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం తదితర కార్యక్రమాలను పూజారులు జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ సభ్యులు పి.నారాయణరెడ్డి, బి.వెంకటనారాయణగౌడ్, టి.రంగారెడ్డి, డి.రవీందర్‌రెడ్డి, ఎం.నరిస్రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికే 'రైతు నేస్తం'

పాలకవీడు : రైతుల కష్టాలు తెలుసుకొని వారికి సౌకర్యాలు కల్పించడానికి, వారి సమస్యలు పరిష్కరించడమే రైతు నేస్తం కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఏడీఏ సంధ్యారాణి పేర్కొన్నారు. మంగళవారం పాలకవీడు మండలంలోని గుడుగుంట్లపాలెంలోని రైతువేదికలో ప్రభుత్వ అధికారులతో జరిగిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నేలల స్వభావాన్ని బట్టి 26 రకాల పంటలను పండించవచ్చని తెలిపారు. అనంతరం ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు శ్రీనివాస్, జావీద్, ప్రీతం కుమార్, ఏఈఓలు రైతులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఏడీఏ సంధ్యారాణి అధికారులు, రైతులు

ప్రభుత్వ భూమిని పరిశీలించిన ఆర్డీఓ


ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని 1088 సర్వే నంబర్‌లో గల ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుందని స్థానిక రైతులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రభుత్వ భూమిని మంగళవారం హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ భూముల వివరాలను స్థానిక తహసీల్దార్ జ్యోతిని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా రేవూరు, రామాపురం గ్రామాల పరిధిలో నూతనంగా మంజూరైన పెట్రోల్ బంక్‌ల నిర్మాణాలకు స్థలాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ శౌధర్ తదితరులు ఉన్నారు.

ఇంటర్మీడియట్ పాఠ్యపుస్తకాలు పంపిణీ


కోదాడలో ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న అధ్యాపకులు

కోదాడ : ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం అందించే పాఠ్యపుస్తకాలు కళాశాలలకు చేరాయి. దీంతో మంగళవారం కళాశాలల్లో తరగతులకు హాజరవుతున్న ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు పంపిణీని ప్రారంభించారు. కోదాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ రాపోలు శ్రీనివాస్ పుస్తకాలు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థుల కోసం ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎం. ప్రభాకర్‌రెడ్డి అధ్యాపకులు జి.శ్రీనివాస్, గురవయ్య, వేముల వెంకటేశ్వర్లు, యాదగిరి, బలభీమారావు తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ సామాజిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

హుజూర్‌నగర్ : సూర్యాపేటలో ఈనెల 30, జూలై 1న నిర్వహించబోయే కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా స్థాయి సామాజిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మద్రి నాగేశ్వరరావు కోరారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని అమరవీరుల భవనంలో కేవీపీఎస్ శిక్షణ తరగతుల కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మీసాల వీరబాబు, గొబ్బి అబ్రహం, శీలం శ్రీను, పి.హుస్సేన్, శంభులింగం పాల్గొన్నారు.


కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

ఫీజుల దోపిడీని అరికట్టాలని వినతి

సూర్యాపేటటౌన్ : ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని, అధిక ధరలతో పాఠ్యపుస్తకాల అమ్మకాన్ని అరికట్టాలని పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో మంగళవారం సూర్యాపేట పట్టణంలో డీఈఓకు వినతిపత్రం అందజేశారు. విద్యార్థి నాయకులు పోలెబోయిన కిరణ్, పుల్లూరి సింహాద్రి, రవి, పిడమర్తి భరత్, మున్నా అశోక్, బండి రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

సూర్యాపేట : మండల పరిధిలోని రత్నపురంలో మంగళవారం విద్యుదాఘాతంతో ఓ గేదె మృతి చెందింది. బాధితురాలు రాచకొండ సంధ్య తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగానే గేదెను మేత మేసేందుకు వదిలామని, మేత మేసిన అనంతరం గేదె రత్నపురం పల్లె చెరువులో నీళ్లు తాగుతుండగా విద్యుత్ సరఫరా అవుతున్న స్తంభానికి గేదె తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.80వేలు ఉంటుందని బాధితురాలు తెలిపింది.

మాదిగ దండోరా రజతోత్సవ కరపత్రం ఆవిష్కరణ


కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : మాదిగ దండోరా రజతోత్సవాలను విజయవంతం చేయాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పల్లేటి లక్ష్మణ్ మాదిగ అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో మాదిగ దండోరా రజతోత్సవాల కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జూలై 7న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతీలో మాదిగ దండోరా రజతోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి రావూరి విజయభాస్కర్, మేళ్లచెరువు ముక్కంటి, రెడపంగు రాము, మిద్దె వెంకటేశ్వర్లు, కస్తాల రవీందర్, బండారు శంకర్, కందుకూరు రాము, కస్తాల సైదులు, గుండెపంగు కృష్ణ, పిడమర్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నడిగూడెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ మన్నెం సోమయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు సాధారణ కోర్సులతో పాటు ఆరు వృత్తి విద్యా కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని ఆమె తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనపై నేడు అవగాహన ర్యాలీ

కోదాడరూరల్ : కోదాడ సబ్ డివిజన్ పోలీసులతో బుధవారం డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు పట్టణ సీఐ రాము మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల నుంచి రంగా థియేటర్ సెంటర్ వరకు ర్యాలీ ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. పట్టణంలోని పలు విద్యాసంస్థల విద్యార్థులు, యాజమాన్యాలు, యువకులు, సామాజిక కార్యకర్తలు పాల్గొంటారని ఆయన తెలిపారు.

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి


విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేస్తున్న దాత

అనంతగిరి : దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని గోండ్రియాల ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం నందిపాటి సుధాకర్ అన్నారు. మంగళవారం గోండ్రియాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అందె వసుందర తన తండ్రి శ్రీనివాస్ జ్ఞాపకార్థం రూ.ఐదువేల విలువైన నోట్ బుక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హమీద్, మల్లికార్జున్‌రావు, ఆర్.శ్రీనివాసరావు, రమ, ఐఈఆర్టీ ఓంకారం, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత అభినందనీయం


విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

గరిడేపల్లి : మండల కేంద్రానికి చెందిన గొడుగు సైదులు తన కూతురు గొడుగు హారిక జ్ఞాపకార్థం విద్యార్థులకు చేయూతనందించడం అభినందనీయమని మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గొడుగు హారిక 18వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ, కాంగ్రెస్ నాయకుడు మేకపోతుల చంద్రయ్య గౌడ్, చామకూరి అనిల్, వల్లపుదాసు జోష్, నకిరేకంటి సైదులు, చామకూరి హరీష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

హుజూర్‌నగర్ : పట్టణంలోని 20వ వార్డులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన టి.కొండలు కుటుంబసభ్యులకు మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. నాయకులు పండ్ల హుస్సేన్, దొంతగాని జగన్, అర్జున్, కొరివి, వీరబాబు, రాము, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి వేడుకలు

నేరేడుచర్ల : మండలంలోని సోమారం గ్రామంలో గల సోమేశ్వరాలయంలో మంగళవారం సంకటహర చతుర్థి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు ఇరువంటి శ్రీనివాసశాస్త్రి వేద మంత్రోత్సవాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి విగ్రహం, శివలింగానికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం గణనాథుడు, సోమేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.


సోమప్ప ఆలయంలో ప్రత్యేక అలంకరణలో గణపతి, శివుడు

అష్టోత్తర శతనామ పూజను గరికతో నిర్వహించి స్వామివారికి ఎర్రటి వస్త్రాల్లో ముడుపులు కట్టారు. ఈ ముడుపును మరుసటి రోజు స్వామివారికి నివేదన చేస్తామని, ఇలా చేస్తే కోరికలు నేరవేరుతాయని, ఇలా మూడు, ఐదు వారాలు పాటించడం శుభప్రదమని అర్చకుడు శ్రీనివాసశాస్త్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిత్తనూరి సత్యనారాయణ, ఆలయ కమిటీ వైస్ చైర్మన్ లొడంగి లక్ష్మయ్య, డైరెక్టర్లు సోమయ్య, సైదులు, బాలామణి, నాగు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను


మఠంపల్లి : చౌటపల్లిలో మాట్లాడుతున్న సయ్యద్‌రన్‌మియా

హుజూర్‌నగర్‌రూరల్ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టబోయే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను పిలుపునిచ్చారు. మంగళవారం హుజూర్‌నగర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన గ్రామ పంచాయతీ కార్మికుల సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోషణబోయిన హుస్సేన్‌తో కలిసి ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కార్మికులకు నెలనెల వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగుస్తుండడంతో వారు కార్మికుల వేతనాల బిల్లులు డ్రా చేసుకొని వీరి కడుపు కొట్టారని ఆరోపించారు. తక్షణమే పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్మికులకు నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నిరవధిక సమ్మెకు కార్మికులు సిద్ధపడతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు షేక్ హసన్‌మియా, కార్మికులు వీరారెడ్డి, రంగారెడ్డి, నాగేశ్వరరావు, నాగరాజు, కాటయ్య, రత్నం, కొండలు, గౌసు, యల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

మఠంపల్లి : పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ వద్ద సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించబోయే ధర్నాకు కార్మికులు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ రన్‌మియా కోరారు. మంగళవారం మఠంపల్లి మండలంలోని చౌటపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏళ్లతరబడి మల్టీ పర్పస్ వర్కర్లుగా వెట్టి చాకిరీ చేస్తున్న కార్మికుల సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని అన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు, కార్మికులు దేవదానం, బాలశౌరి, కిట్టయ్య, కొండలు, వినోద్, శ్రీను, సామ్రాజ్యం, రాకేష్, రవి, నాగరాజు, వెంకటేశ్వర్లు, సైదా, వీరస్వామి, బార్గవరెడ్డి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నీట్ పేపర్ లీకేజీపై విచారణ జరిపించాలి

హుజూర్‌నగర్ : నీట్ పేపర్ లీకేజీపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎం.చందర్‌రావు అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని శ్రామిక భవన్‌లో నిర్వహించిన పీడీఎస్‌యూ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంబీబీఎస్, ఇతర వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్- యూజీ పరీక్షలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. దీంతో దేశవ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని తెలిపారు. బిహార్‌లో రూ.30 లక్షలకు నీట్ ప్రశ్న పత్రాలు విక్రయించారనే ఆరోపణపై అరెస్టులు జరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయని ఆయన తెలిపారు. ఇంత జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, ప్రణేష్, అశోక్, రంగస్వామి, నవీన్, నాగరాజు, మురళి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి చందర్‌రావు

వీరారెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు, మల్లారెడ్డిగూడెం మాజీ సర్పంచ్ ఉస్తెల వీరారెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉస్తెల నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం చింతలపాలెంలోని సోమిరెడ్డి వెంకటరెడ్డి స్మారక భవనం (సీపీఐ కార్యాలయం)లో ఉస్తెల వీరారెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద ఉన్న వీరారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేదలకు భూములు పంచడం, దళితులకు ఇంటి స్థలాలు అందించడం, ప్రజా సమస్యల పరిష్కారానికి వీరారెడ్డి పోరాడారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ చింతలపాలెం, మేళ్లచెరువు మండలాల కార్యదర్శులు చింతిరాల రవి, సారెడ్డి పాపిరెడ్డి, నాయకులు అమీర్ సాబ్, వి.కోటమ్మ, డి.అంకరాజు, సీహెచ్.వీరబాబు, అబ్దుల్ భాష, గోనె అంకయ్య, జియాలుద్దీన్, భీమిశెట్టి పద్మ, సత్యనారాయణ, తాళ్లూరి సత్యం, సురేందర్, రామయ్య, కృష్ణ, కోటిరెడ్డి, ధనంజిరెడ్డి, చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వీరారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

సూర్యాపేటలో గంజాయిని నిర్మూలించాలి


ఎస్ఐలకు సూచనలు చేస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సూర్యాపేటటౌన్ : పట్టణంలో గంజాయి వినియోగించే వారిని గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి గంజాయిని నిర్మూలించాలని, అదే విధంగా అక్రమ కార్యకలాపాలు, అక్రమ వ్యాపారాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, రాత్రి పూట ఆకతాయిల కదలికలను పూర్తిగా అరికట్టాలని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ పట్టణ పోలీసులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి ఆయన మాట్లాడారు. పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు అమలు చేస్తూ నిత్యం తనిఖీలు నిర్వహించాలన్నారు. పట్టణ పరిధిలో సీసీకెమెరాల ఏర్పాటు పెంచి నేరాలకు అవకాశం ఉన్న అన్ని ప్రాంతాలను కవర్ చేయాలన్నారు. కేసులు పెండింగ్ ఉండకుండా పనిచేయాలని, నైపుణ్యంతో కేసుల దర్యాప్తు చేయాలని సూచించారు. ఫిర్యాదులపై వేగంగా స్పందించాలని కోరారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ రవి, పట్టణ ఎస్ఐలు కుశలవ, లోకేష్, బాలకృష్ణ, మహేందర్, సిబ్బంది ఉన్నారు.